ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జనగామ
సోమవారం 15 ఏప్రిల్ 2024
5

నేడు కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం

హాజరు కానున్న ఎమ్మెల్యే కడియం, ఇందిర, కావ్య

జఫర్‌గఢ్, ఏప్రిల్ 14 : మండలకేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూకల అయిలయ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సింగపురం ఇందిర, వరంగల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కావ్య హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు విధిగా హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కొనుగోళ్లు ఆగొద్దు

- మూడు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ
- ఆర్డీవోకు పర్యవేక్షణ బాధ్యతలు
- ట్రేడర్ల బాయ్‌కాట్‌తో అధికారుల నిర్ణయం
- కనీస మద్దతు ధరకు అమ్ముకునేలా చర్యలు



జనగామ మార్కెట్‌కు వచ్చిన ధాన్యం

జనగామ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జనగామ వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనుగోలుపై జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక నజర్ పెట్టింది. ధాన్యం కొనుగోళ్లకు ట్రేడర్లు దూరంగా ఉండడంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 10న ధాన్యాన్ని తక్కువ ధరకు కొనే ప్రయత్నం చేయడంతో ముగ్గురు ట్రేడర్లపై అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ అంశం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో తమపై పెట్టిన కేసులను ఎత్తివేసే వరకు కొనుగోళ్లు జరిపేది లేదని ట్రేడర్లు నిర్ణయించారు. దీంతో మార్కెట్‌లో కొనుగోళ్లపై సస్పెన్స్ ఏర్పడింది. ట్రేడర్లతో చర్చలు జరిపి కొనుగోళ్లు జరిగేలా చూడాలని అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ట్రేడర్లతో మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజునాయక్ శనివారం చర్చలు జరిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనాల్సిందేనని తెగేసి చెప్పారు. దీనికి వారు అంగీకరించలేదు. తాము మద్దతు ధర చెల్లించలేమని చేతులెత్తేశారు. దీంతో పాటు తమపై పెట్టిన కేసులను ఎత్తివేస్తేనే కొనుగోళ్లు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఫలితంగా కొనుగోళ్లపై సందిగ్ధత ఏర్పడింది. ఈనెల 11 నుంచి ఆదివారం వరకు మార్కెట్‌కు సెలవులు వచ్చాయి. సోమవారం నుంచి మార్కెట్ తిరిగి ఓపెన్ కానుంది. ఈ క్రమంలో ప్రభుత్వ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు.

జనగామ మార్కెట్‌లో ఇప్పటికే ఒక పీఏసీఎస్, ఒక ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. వీటితో పాటు మార్కెట్ పక్కన చీటకోడూరు రోడ్డులో ఏర్పాటు చేసిన మరో పీఏసీఎస్ కేంద్రాన్ని సైతం మార్కెట్ ఆవరణలోకే తరలించారు. దీంతో మొత్తంగా మూడు కేంద్రాల ద్వారా మార్కెట్‌లో కొనుగోళ్లు చేపట్టనున్నారు.

ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించేందుకు జనగామ ఆర్డీవో కొమురయ్యకు అధికారులు పర్యవేక్షణ బాధ్యతలను అప్పగించారు. మార్కెట్‌లో మూడు సెంటర్లను ఏర్పాటు చేయగా ఒక్కో సెంటర్‌కు ఒక నాయబ్ తహసీల్దార్‌ను ఇన్‌చార్జులను నియమించారు. ఈ ముగ్గురిపై జనగామ తహసీల్దార్ వెంకన్న పర్యవేక్షణ జరుపుతారు. వీరితో పాటు మండల వ్యవసాయ శాఖ అధికారులు సైతం కేంద్రాల వద్దే విధులు నిర్వర్తించనున్నారు. రైతు ధాన్యాన్ని తీసుకురాగానే తేమ శాతాన్ని పరిశీలించి నమోదు చేస్తారు. వచ్చిన తేమ శాతాన్ని బట్టి ఆరబోయడం, తూర్పార పట్టడం వంటి వాటిపై రైతులకు సూచనలు చేస్తారు. తేమ శాతం సరిగ్గా వచ్చిన రైతులు కనీస మద్దతు ధరకు అమ్ముకునే వరకు అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వనున్నారు.



కుందారంలో సాగునీరు లేక ఎండిపోయిన వరిచేనులో మేస్తున్న గొర్రెలు

ఆశలు ఆవిరి!

పొట్ట దశలో ఎండిపోతున్న పంటపొలాలు

- ఎన్ని బోర్లు వేసినా కానరాని నీటి జాడలు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- అప్పులభారంతో సతమతం
- సర్కారు సాయం కోసం ఎదురుచూపులు

> పొట్ట దశలో ఉన్న రెండెకరాల వరి ఎండ పోతుంటే చూడలేక దొరికిన చోటల్లా అప్పు చేసి మూడు బోర్లు వేయించా. ఎందులోనూ చుక్క నీరు రాలేదు. రూ. 1.20 లక్షల ఖర్చయింది. పెట్టుబడికి మరో రూ.60 వేలు అయింది. ఏం చేయాలో అర్థం కావట్లేదు.
>
> - ఓ రైతు ఆవేదన

లింగాలఘణపురం, ఏప్రిల్14: ఇన్నాళ్లుగా వికసించిన పైర్ల పచ్చదనం.. ఈ ఏడాది నీళ్ల కరువుతో పటాపంచలై అన్నదాతను అప్పులపాల్జేస్తోంది. తాతల కాలం నుంచి నమ్ముకున్న వ్యవసాయం ఇప్పుడిప్పుడే గాడినపడుతుందనుకున్న ఆనందం.. అంతలోనే తిరగబడి పాడు జ్ఞాపకాలను గుర్తు చేస్తోంది. పదిహేనేళ్ల క్రితం మనకబారిన కరువు మళ్లీ దర్శనమిస్తూ అన్నదాతను ఆందోళనకు గురిచేస్తోంది. ప్రభుత్వ పథకాలు అన్నదాతకు అండగా నిలుస్తున్నప్పటికీ వెన్నుచూపుతున్న ప్రకృతి మాత్రం సాగుబడిని సాగిలపడేలా చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా సాగు చేసిన పంటపొలాలు సరిగ్గా చేతికందే స్థాయిలోనే చేజారిపోతున్న తీరు అన్నదాతకు పుట్టెడు దుఃఖాన్ని మిగులుస్తోంది.

కానరాని నీటి జాడలు..

జిల్లాలో ప్రధానంగా చీటకోడూరు, నవాబుపేట, మల్లన్నగండి, బొమ్మకూరు, కన్నెబోయినగూడెం, వెల్దండ, అశ్వరావుపల్లి, స్టేషన్‌ఘన్‌పూర్ రిజర్వాయర్లు ఉండగా ఒక్క చీటకోడూరు రిజర్వాయర్ మాత్రం తాగునీటి సరఫరా కోసం ఉద్దేశించినది. మిగతా రిజర్వాయర్లన్నీ సాగునీటి కోసం ఏర్పాటు చేసినవే. అయితే ఏటా సాగునీటి రిజర్వాయర్లను నింపి కాలువల ద్వారా పంట పొలాలకు వదిలేసే అధికారులు ఈ ఏడాది కేవలం రిజర్వాయర్లకు మాత్రమే పరిమితం చేయడంతో పంటపొలాలకు నీళ్ల కరువు ఏర్పడింది. నవాబుపేట రిజర్వాయర్ విషయానికి వస్తే నీళ్లు లేక రిజర్వాయర్ పూర్తిగా అడుగంటే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ఆయకట్టు పరిధి చెరువులు, కుంటలు పూర్తిగా ఎండిపోయి భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. దీంతో కోటి ఆశలతో సాగు చేసిన పంటపొలాలన్నీ మొదట్లో సాగునీటితో కళకళలాడినా ఎండలు తీవ్రమయ్యేనాటికి ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు దొరికిన చోటల్లా అప్పులు తెచ్చి బోరు బావులు తవ్వినా నిష్ప్రయోజనంగా మారిపోతోంది.

పదేళ్ల కాపాయం కరువు పాలు..

లింగాలఘణపురం మండలం కుందారం గ్రామానికి చెందిన చిర్ర యాదయ్య అనే రైతు తనకున్న రెండు ఎకరాల్లో ఏటా వరిపంటను సాగు చేస్తున్నాడు. పెట్టుబడి ఖర్చులు పోగా కాస్తో కూస్తో.. ఎకరాకు రూ. 10వేల లెక్కన



కొత్తపల్లిలో నీళ్లు లేక ఎండిపోయిన వరిచేనును మేస్తున్న గేదెలు

మిగులుబాటు చేసుకుని ఉన్నదాంట్లో కాపాయం చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. ఈఏడాది రెండెకరాల పంట సాగుకు సుమారుగా రూ. 60వేల పెట్టుబడి పెట్టి పంటలను కంటికి రెప్పలా కాపాడుకునే ప్రయత్నం చేశాడు. అయితే చివరి దశలో తనకున్న బోరు బావి అడుగంటిపోయింది. దీంతో పొరుగు రైతుల సూచనతో వెంటనే 250 ఫీట్ల లోతు బోరుబావిని తవ్వించినా చుక్కనీరు రాలేదు.. మళ్లీ మొండి ధైర్యం చేసి కాస్త దూరంగా మరో 230 ఫీట్ల బోరు బావిని తవ్వించినా ఫలితం శూన్యం. చివరిగా దింపుడు కల్లం ఆశలతో మూడో బోరు 230 ఫీట్ల లోతుగా తవ్వించినా కూడా రాతి పొడి తప్ప చుక్కనీటి జాడలేకపోవడంతో ఆశలు చాలించుకున్నాడు. మూడు బోరుబావులు తవ్వించగా మొత్తం రూ. 1.20 లక్షల ఖర్చు నెత్తిన అప్పుల కుప్పగా మిగిలిందని ఆవేదన చెందుతున్నాడు. చివరిగా చేసేదేమిలేక రెండెకరాల పంటపొలంలో పశువులను మేపుతున్నాడు. ఇది ఒక్క యాదయ్య అనుభవం మాత్రమే కాదు.. ఊరూరా ఇలాంటి యాదయ్యలు ఎంతోమంది ఉన్నారు.



కుందారంలో వట్టిపోయిన బోరుబావి



కుందారంలో చుక్కనీరు కనిపించని బోరుబావి

ఆశలన్నీ ఆవిరైపోయాయి

- చిర్ర యాదయ్య, రైతు, కుందారం



కోటి ఆశలతో రూ. 60వేల పెట్టుబడి పెట్టి రెండెకరాల పొలంలో వరిసాగు చేశాను. పంట చేతికి అందుతుందని ఆశపడుతున్న లోపే బోరుబావులు పూర్తిగా వట్టిపోయి సాగునీటికి తీవ్రమైన సమస్య ఏర్పడింది. ఏం చేయాలో తోయక రూ. 1.20 లక్షలు అప్పులు తెచ్చి వరుసగా మూడు బోర్లు వేస్తే చుక్క నీరు రాకపోగా దుమ్ములేచింది. ఇలాంటి పరిస్థితులు వస్తాయని కలలో కూడా ఊహించలేదు. గత పదేళ్లుగా పెట్టుబడి ఖర్చులు పోను ఏటేటా రూ. 10వేలు మిగులు కనిపిస్తే ఈ సారి పదేళ్ల కాపాయం వడ్డీతో సహా కరువు పాలైపోయింది. ఇప్పటికైనా ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలి. లేదంటే మా బతుకులు ఆగమే.

కాంగ్రెస్ శ్రేణుల్లో ఘర్షణ

- బీఆర్ఎస్ కార్యకర్తలను చేర్చుకోవడంపై లొల్లి
- దేవరుప్పులలో ర్యూన్సిరెడ్డిని నిలదీసిన నాయకులు
- 15 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు



దేవరుప్పులలో ఘర్షణకు దిగుతున్న కాంగ్రెస్ నాయకులు

వివరాలు 8లో..

అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): నేటి యువత అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని జనగామ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అణగారిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించి వారి అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడని కొనియాడారు. అంబేడ్కర్ లేకుండా పేద వర్గాలకు చదువు, ఉద్యోగాలు సాధ్యమయ్యేవి కావన్నారు. దేశంలో సమసమాజ స్థాపన జరగాలంటే రిజర్వేషన్లు కొనసాగాల్సిందేనని అన్నారు. దేశంలో ఎక్కడా లేనంతగా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని కేసీఆర్ స్థాపించారని గుర్తు చేశారు. రాష్ట్ర సచివాలయానికి సైతం అంబేడ్కర్ పేరు పెట్టి గౌరవించుకున్నామన్నారు. దేశంలో తెలంగాణ మినహా ఏ రాష్ట్రాలు కూడా అంబేడ్కర్ పేరు పెట్టలేదని అన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఏబీవీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే పల్లా సందర్శించి రక్తదాతలకు సర్టిఫికెట్లను అందించారు.



అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ముత్తిరెడ్డి.. దమ్ముంటే చర్చకు రా!



మాట్లాడుతున్న ప్రేమలతారెడ్డి

నాపై ఆరోపణలను నిరూపించు

మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ప్రేమలతారెడ్డి

జనగామ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిపై జనగామ మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్, సీనియర్ నాయకురాలు గాడిపల్లి ప్రేమలతారెడ్డి తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. తాను దళితుల భూములను ఆక్రమిస్తే తిరిగి దళితులకు ఇప్పించానంటూ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆమె ధ్వజమెత్తారు. జనగామలోని ఆమె నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. తన సొంత భూమిలో జేసీబీతో చదును చేయించి తన కొడుకుపై అక్రమ కేసు పెట్టించారని అన్నారు. ప్రభుత్వ సీడీఎఫ్ నిధులతో తన భూమిలో రోడ్డు వేయించాలని ముత్తిరెడ్డి ప్రయత్నించారని అన్నారు. తన భూమిలో నుంచి 20 ఏళ్ల క్రితమే రోడ్డు ఉందని చెప్పడం సిగ్గు చేటని అన్నారు. 20 మంది దళితుల భూములను ఆక్రమించానని ముత్తిరెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో తన తండ్రి పసుపు కుంకుమ కింద ఇచ్చిన భూములను దళితులకు తానే దానం ఇచ్చానని తెలిపారు. తాను దానం ఇచ్చిన భూములను తానే ఆక్రమించానని చెప్పడం

మిగతా 8వ పేజీలో..

సొంతగూటికి రాజయ్య

కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎమ్మెల్యే



కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 14 : స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఎట్టకేలకు సొంతగూటికి చేరుకున్నారు. మాజీ సీఎం కేసీఆర్ సమక్షంలో ఆదివారం సిద్ధిపేట జిల్లా ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో పార్టీ కండువా కప్పుకున్నారు. తెలంగాణ ఉద్యమం ఉధృతంగా ఉన్న సమయంలో రాజయ్య అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్ఎస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు టికెట్ రానందుకు నిరసనగా ఫిబ్రవరి 3న బీఆర్ఎస్ పార్టీకి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. వారం రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరుతానని ప్రకటించారు. ఈ నేపథ్యంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర అనుచరులు రాజయ్యను కాంగ్రెస్ పార్టీలోకి తీసుకోవద్దు అంటూ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. నియోజకవర్గ మహిళా నాయకులు ఏకంగా గాంధీభవన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. అధిష్ఠానానికి వినతిపత్రాలు అందించారు. అయినప్పటికీ రాజయ్య సీఎం రేవంత్ రెడ్డిని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను, పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని, దామోదర రాజనర్సింహను కలిసి పార్టీ చేరిక అంశమై చర్చించారు. అయినా రాజయ్యకు కాంగ్రెస్ పార్టీ నుంచి ఆహ్వానం రాలేదు. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్చి 13న వరంగల్ పార్లమెంట్ టికెట్‌ను కడియం కావ్యకు ఇస్తున్నట్లు ప్రకటించారు. తదనంతరం మార్చి 28న బీఆర్ఎస్ పార్టీ నుంచి తాను పోటీ చేయనని కావ్య టికెట్‌ను నిరాకరిస్తూ కేసీఆర్‌కు లేఖ రాశారు. మార్చి 29న కాంగ్రెస్ నాయకులు కడియంను పార్టీలోకి ఆహ్వానించడం, 31న కడియం శ్రీహరి, కావ్య రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరడం, ఏప్రిల్ 1న వరంగల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా కడియం కావ్య పేరును ప్రకటించడం వరుసగా జరిగిపోయాయి. అప్పటి నుంచి రాజయ్య బీఆర్ఎస్ పార్టీ తనకు వరంగల్ పార్లమెంట్ టికెట్ ఇస్తే తిరిగి పార్టీలో చేరడానికి సిద్ధమయ్యారు. ఈ నెల 12న ఎంపీ టికెట్ రాజయ్యకు ప్రకటిస్తారనే వార్తలు రావడంతో రాజయ్య ఎర్రవెల్లికి వెళ్లారు. కాని చివరికి కేసీఆర్ హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్ పేరును ప్రకటించడంతో రాజయ్య ఎర్రవెల్లిలో కేసీఆర్‌ను కలువకుండానే వెనుదిరిగారు. చివరకు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజయ్య ఆదివారం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

అమ్మను దూషిస్తోందని..

- నానమ్మను కత్తితో పొడిచిన మనవడు
- ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మృతి
- కేసు నమోదు చేసిన పోలీసులు

జఫర్‌గఢ్, ఏప్రిల్ 14: తల్లిని తరచుగా దూషిస్తూ గొడవ పెట్టుకుంటోందని ఆగ్రహించిన 13 ఏళ్ల మనవడు.. 65 ఏళ్ల వయసున్న నానమ్మను కత్తితో పొడిచి చంపిన దారుణ ఘటన జనగామ జిల్లాలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జఫర్‌గఢ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉండగా అందరి వివాహాలు చేశారు. కొడుకు సుమారు పదేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటికే ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. అప్పటి నుంచి కోడలు, ఇద్దరు మనవలతో కలసి అందరూ ఒకే ఇంట్లో ఉంటున్నారు. వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే కొన్నాళ్లుగా అత్తాకోడళ్ల మధ్య కుటుంబ సమస్యలపై తరచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి కూడా పరస్పర దూషణలతో తీవ్రంగా గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన చిన్న మనవడు కత్తితో నానమ్మ ఛాతిపై పొడిచాడు. దీంతో తీవ్ర రక్తస్రావం జరిగి కింద పడిపోయింది. కుటుంబీకులు వెంటనే ఆమెను అదే రాత్రి హనుమకొండ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలోనే చనిపోయింది. ఆలస్యంగా సమాచారం అందుకున్న వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాశ్, జఫర్‌గఢ్ ఎస్ఐ శీలం రవియాదవ్ ఆదివారం ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్‌పై వెళ్తూ.. సమస్యలు వింటూ..

ఆదర్శంగా నిలుస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

పాలకుర్తి, ఏప్రిల్ 14 : శాంతి భద్రతల పరిరక్షణలో నిత్యం తలమునకలయ్యే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఊరూరా తిరుగుతూ సమస్యలు తెలుసుకుంటున్నారు. ప్రజలను కలుస్తూ వారి సాధకబాధకాలను వింటూ ఆదర్శంగా నిలుస్తున్నారు పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి. నెల రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన ఆయన తనదైన శైలిలో అక్రమాలను అరికడుతున్నారు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున సైకిల్ ఎక్కిన సీఐ మహేందర్‌రెడ్డి పాలకుర్తి మండలంలోని సిరిసన్నగూడెం, వల్మిడి, ముత్తారం, వావిలాల, మల్లంపల్లి, దర్దెపల్లి కొడకండ్ల మండలంలోని ఏడునూతుల గ్రామాలను చుట్టి వచ్చారు. ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గుడుంబా వల్ల కలిగే నష్టాలను వివరించారు. మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్య పరిచారు. ఫేక్ కాల్స్, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని వివరించారు. వేసవి కాలంలో ఊరు విడిచి వెళితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డయల్ 100 ప్రయోజనాల గురించి వివరించారు. సీఐ స్థాయి వ్యక్తి సైకిల్‌ను తొక్కుకుంటూ గ్రామస్థుల వద్దకే రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు మారుపేరుగా నిలుస్తున్నారని మహేందర్ రెడ్డిని కొనియాడుతున్నారు.



పాలకుర్తి మండలంలో సైకిల్‌పై వెళ్తున్న సీఐ, ఎస్సైలు

మైనారిటీ నిరుద్యోగులకు చక్కటి అవకాశం

వడ్డెపల్లి, ఏప్రిల్ 14 : మైనారిటీల ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక పథకాలను రూపొందించి అమలు చేస్తోంది. పోటీ పరీక్షల కోసం మైనారిటీ ఉద్యోగులకు ఉచిత శిక్షణను ఇస్తూ వారిని ప్రోత్సహిస్తోంది. యూపీఎస్‌సీ- సీఎస్ఏటీ- 2025 పరీక్ష కోసం 2024-25 విద్యా సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ 100 మంది మైనారిటీస్ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తుంది. రిజర్వేషన్ల నిబంధనల ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరీలలో దివ్యాంగులకు 5 శాతం సీట్లను కేటాయించారు.

దరఖాస్తు చేసుకునే విధానం

యూపీఎస్‌సీ (సీఎస్ఏటీ- 2025) సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్టులో ప్రవేశం కోసం అన్ని జిల్లాల్లోని సాధారణ/ ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థులు ఈ నెల 22 లోగా ఆన్‌లైన్ లో గిగిగ్ి.ఙుట్బజీట్ట జ్బుబ్బ్బ.చిఙజౌరి.జీ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి. స్ర్కీనింగ్ టెస్టు ఈనెల 28న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జిల్లా కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలల్లో నిర్వహిస్తారు.



అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మేన శ్రీను, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి



ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని జిల్లాలోని మైనారిటీస్ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి. డిగ్రీ పూర్తి చేసిన సాధారణ, ప్రొఫెషనల్ అభ్యర్థులు ఈ నెల 22 లోగా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను చేసుకోవాలి. ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపాదికన నిర్వహిస్తారు. ఈ నెల 28న నిర్వహించే స్ర్కీనింగ్ టెస్టులో మైనారిటీ అభ్యర్థులు పాల్గొనాలన్నారు. వివరాలకు ఫోన్ నంబరు : 040- 23236112 లో సంప్రదించాలి.

కడియం కావ్యకే మా మద్దతు


ఎమ్మెల్యే శ్రీహరిని కలిసిన దళిత సంఘాల నేతలు

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 14 : వరంగల్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్యకు తెలంగాణ మాదిగ దండోరా, టీఎమ్మార్పీఎస్, తెలంగాణ బైండ్ల సంఘం, మాల మహానాడు నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్న తెలిపారు. ఆదివారం హనుమకొండలోని ఎమ్మెల్యే కడియం శ్రీహరి నివాసంలో కలిసి కడియం కావ్యను భారీ మెజార్టీతో గెలిపించి మంద కృష్ణ మాదిగకు తగిన బుద్ధి చెబుతామని తెలిపారు. వర్గీకరణ పేరుతో మాదిగలను, మాదిగ ఉప కులాలను మంద కృష్ణ మోసం చేస్తున్నారని వారు ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ జాతికే ద్రోహం చేయాలని చూస్తున్నారని, దేశ వ్యాప్తంగా దళితుల ఊచ కోతకోస్తున్న బీజేపీ పంచనచేరి ఏ విధంగా ఓటు అడుతున్నాడో చెప్పాలని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకొని దేశాన్ని మతతత్వ పార్టీ నుంచి కాపాడుకోవాలని కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఇటుక రాజు మాదిగ, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపకులు జన్ను కనకరాజు, జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం, రాష్ట్ర అధ్యక్షుడు కోరిపెల్లి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పద్మారావు, బైండ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అదుళ్ల గౌరిశంకర్, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి పసుల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై కుట్ర


హనుమకొండ జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ మినీ స్టేడియం

- అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు చుక్కెదురు
- స్పోర్ట్స్ హాస్టల్ నుంచి తరలించేందుకు ప్రయత్నాలు
- అంతర్మథనంలో క్రీడాకారులు.. ఖండిస్తున్న క్రీడా సంఘాలు
- ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి



హనుమకొండ జేఎన్ఎస్‌లోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 14 : అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ హాస్టల్ అందని ద్రాక్షగా మారుతోందనే సమాచారంతో అంతర్మథనం చెందుతున్నారు. యేళ్లతరబడి అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్ క్రీడల్లో అద్భుత ప్రతిభ చాటుతూ స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించినక్రీడాకారులను ఇక్కడి నుంచి తరలించాలనే ప్రయత్నాలు జరుగుతున్నట్లు వస్తున్న వార్తలతో ఆందోళన చెందుతున్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాలతో రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లోని అథ్లెట్లకు వేరే ప్రాంతాలకు పంపించే యోచనలో స్పోర్ట్స్ అధికారులు ఉన్నట్లు తెలిసి క్రీడాకారులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుల కేంద్రంగా పేరుగాంచిన హనుమకొండలోని రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్ తీరుపై జిల్లాకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్కలు స్పందించాలని పలు క్రీడా సంఘాల బాధ్యులు వేడుకుంటున్నారు.

తరలింపు ఆలోచన

హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూస్టేడియం (జేఎన్ఎస్)లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ) ఆధ్వర్యంలో మూడు దశాబ్దాల నుంచి రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ ఆధారంగా రాణించిన క్రీడాకారులకు వసతి కల్పిస్తూ క్రీడల్లో శిక్షణ అందిస్తోంది. అయితే జిమ్నాస్టిక్ క్రీడాకారులను మినహాయించి అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే ప్రాంతాలకు తరలించే ప్రయత్నం జరుగుతోందనే వాదనలతో క్రీడాకారులు ఆందోళన చెందుతున్నారు అథ్లెటిక్స్ హ్యాండ్‌బాల్ క్రీడలను హాస్టల్ నుంచి తొలిగించి వాటి స్థానంలో మరో రెండు క్రీడలను అనుమతించే అవకాశం ఉందని పలువురు క్రీడా సంఘాల సభ్యులు అనుమానంవ్యక్తం చేస్తున్నారు.

కొందరి కుట్ర

కొందరు వ్యక్తులు తమకు అనుకూలంగా ఉన్న క్రీడలను హాస్టల్‌లో వసతి కల్పించాలనే దురాలోచనతోనే అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు స్పోర్ట్స్ హాస్టల్ ఎత్తివేసే ప్రయత్నాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా స్పోర్ట్స్ హాస్టల్‌లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు అనుమతి ఇవ్వకపోవడంతో ఇంతకాలం శిక్షణ పొందిన క్రీడాకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది. దీనిపై స్పోర్ట్స్ అధికారులు పునరాలోచన చేయావలసిన అవసరం ఉందని, లేదంటే నిరసనలకు శ్రీకారం చుడతామని క్రీడాకారులు, క్రీడాసంఘాల బాధ్యులు హెచ్చరిస్తున్నారు.

30 ఏళ్ల కిందట

30 ఏళ్ల కిందట టీడీపీ హయాంలో జిల్లాకు చెందిన అప్పటి మంత్రి దాస్యం ప్రణయ్‌భాస్కర్ ప్రత్యేక చొరవతో జేఎన్ క్రీడా మైదానం అభివృద్ధితో పాటు క్రీడాకారులకు భోజన, బస వసతి కల్పించడానికి రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌ను నిర్మించారు. జిమ్నాస్టిక్స్, అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు వసతితోపాటు పౌష్టికాహారం, అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ అందిచండం కోసం ఉమ్మడి జిల్లా కేంద్రంగా స్పోర్ట్స్ హాస్టల్ నిర్మించారు. 9 ఏళ్ల వయస్సులోనే క్రీడాకారుల కోసం యేటా డీఎస్ఏ ఆధ్వర్యంలో రీజనల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో ప్రవేశాలు కల్పిస్తోంది. డీఎస్ఏ ఆధ్వర్యంలో బ్యాటరీటెస్ట్‌లు నిర్వహిస్తూ ప్రతిభ ఆధారంగా స్పోర్ట్స్ హాస్టల్‌కు క్రీడాకారులను ఎంపిక చేస్తారు. ఎంపిక చేసిన క్రీడాకారులుకు మౌలిక వసతులతోపాటు శిక్షణ అందిస్తోంది. నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ క్రీడాకారుల కు బాసటగా నిలుస్తూ.. ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో తాత్కాలిక డీఎస్ఏ కోచ్‌ల పర్యవేక్షణలో జేఎన్ఎస్‌లోని వివిధ మైదానాల్లో పలు క్రీడాంశాలలో శిక్షణను అందిస్తోంది. అలాగే రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో పౌష్టికాహారంతో పాటు క్రీడా దుస్తులు, వసతి సౌకర్యాలను అందిస్తోంది. ప్రధానంగా అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్, జిమ్నాస్టిక్స్ క్రీడలతోపాటు పలు క్రీడాంశాలలో ఓనమాలు నేర్చుకొని జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. స్పోర్ట్స్ కోటాలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో వందలాదిగా ఉద్యోగాలు పొందారు.

మాకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదు..


జి.అశోక్‌కుమార్, జిల్లా యువజన క్రీడల అధికారి

రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే చోటికి తరలించాలని మాకు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు అందలేదు. ఇటీవల హైదరాబాద్‌లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆధ్వర్యంలో సమావేశం జరిగింది వాస్తవమే. అందులో ఇక్కడి క్రీడాకారుల ప్రతిభ, స్పోర్ట్స్ హాస్టల్ నిర్వహణ వంటి అంశాలపై చర్చ జరిగింది.

క్రీడాకారులకు నష్టం జరుగుతుంది..


బైరబోయిన కైలాస్ యాదవ్, వరంగల్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి

రీజినల్ స్పోర్ట్స్ హాస్టల్‌లో వసతి పొందుతున్న అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే చోటికి తరలిస్తే తీవ్ర నష్టం జరుగుతుంది. క్రీడాకారులను ఉన్న ఫలంగా హాస్టల్ నుంచి పంపించే ప్రయత్నం సరైందికాదు. అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుల మనోవేదనను అర్థం చేసుకొని జిల్లా క్రీడాశాఖ అధికారులు సాట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి హాస్టల్‌ను క్రీడాకారులను వేరే చోటుకు తరలించకుండా పునరాలోచన చేయాల్సి ఉంది.

తరలించే ప్రయత్నం సరైందికాదు


ఇండ్ల నాగేశ్వర్‌రావు, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు

రీజినల్ స్పోర్ట్స్‌హాస్టల్‌లో అథ్లెటిక్స్, హ్యాండ్‌బాల్ క్రీడాకారులను వేరే ప్రాంతాలకు తరలించే ప్రయత్నం సరైందికాదు. దీనిని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోంది. అందుబాటులో ఉన్న అకాడమీ, స్పోర్ట్స్ హాస్టల్‌లో మౌలిక వసతులను కల్పించకుండా కొందరు స్వార్థపరులు క్రీడాకారులను అంధకారంలోకి తీసుకపోయే ప్రమాదం ఉంది. నగరంలో నూతన అకాడమీల ఏర్పాటుకు స్పోర్ట్స్ అధికారులు, మంత్రులు కొండా సురేఖ, సీతక్క కృషి చేయాలి.

కళాకారులకు పుట్టినిల్లు ఓరుగల్లు

- ఏఐఆర్ మాజీ డైరెక్టర్ జైపాల్ రెడ్డి


ఆల్ ఇండియా రేడియో జర్నలిస్టులతో జైపాల్ రెడ్డి

హనుమకొండ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు నగరం కళాకారులకు పుట్టినిల్లని ఆల్ ఇండియా రేడియో మాజీ ఉపసంచాలకుడు చల్లా జైపాల్ రెడ్డి అన్నారు. వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ అధ్యక్షుడు మోటే చిరంజీవి ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ రేడియో కేంద్రం ఎంతోమంది కళాకారుకులకు అవకాశం కల్పించిందని అన్నారు. ఎంతో మంది వ్యాఖ్యాతలు ఇక్కడ పని చేసి పేరు ప్రతిప్రతిష్టలు సంపాదించారని అన్నారు. వ్యాఖ్యాతలకు గతంలో ఉన్న కార్యక్రమాలు ఇప్పుడు లేవని, అలాగే వ్యాఖ్యాతల కార్యక్రమాలు అప్పటి కంటే ఇప్పుడు తగ్గాయని అన్నారు. చక్కటి స్వరంతో కార్యక్రమాలను వ్యాఖ్యాతలు విజయవంతం చేస్తున్నారని అన్నారు. వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం రిటైర్డ్ సీనియర్ వ్యాఖ్యాతలు నెల్లుట్ల సంధ్య, మొగిలిచెర్ల జనార్దన్‌లను ఘనంగా సత్కరించారు.

ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. తమ సేవలను గుర్తించి సన్మానం చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. అలాగే రేడియోతో ఉన్న 30 యేళ్ల అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ రేడియో జర్నలిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అర్షం సదానందం, గౌరవ సలహాదారు డాక్టర్ ఎల్లయ్య, అసోసియేషన్ నాయకులు ఓదెల కృష్ణ, డాక్టర్ చంద్రశేఖర్, రామక్రిష్ణ, డాక్టర్ శ్రీనివాస్, పంకజ్ మోహన్, స్వప్న, స్వాతి, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

సౌండ్ పొల్యూషన్ బైక్ స్వాధీనం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 14 : సౌండ్ పొల్యూషన్ సైలెన్సర్ బైక్ వాడి అతివేగంతో వెళుతున్న వినయ్‌తేజరెడ్డి అనే విద్యార్థిపై కేయూ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం సాయంత్రం సౌండ్‌తో కూడిన సైలెన్సర్ కలిగిన బుల్లెట్‌పై అతివేగంగా వెళుతున్న విద్యార్థిని భీమారం జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. బుల్లెట్ స్వాధీనం చేసుకుని విద్యార్థిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెడ్డిపురం కుంటలో మునిగి యువకుడి మృతి


వాజీద్ మృతదేహం

వరంగల్ క్రైం, ఏప్రిల్ 14 : కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపురం కుంటలో మునిగి యువకుడు మరణించిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. హనుమకొండ అగ్నిమాపక శాఖధికారి నాగరాజు కథనం ప్రకారం.. రెడ్డిపురం కుంటలో ఈత కోసం దిగిన యువకుడు మునిగిపోయాడని వచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. బోటు సహాయంతో కుంటలో గాలించగా గంట తర్వాత మృతదేహం లభించింది. యువకుడి ఆచూకీకోసం ఆరాతీయగా రాయపురకు చెందిన వాజీద్ (25)గా గుర్తించారు. కాగా, విచారణ కోసం స్థానిక పోలీసులకు మృతదేహన్ని అప్పగించినట్లు ఫైర్ ఆఫీసర్ నాగరాజు తెలిపారు. మృతదేహన్ని వెలికితీయడంలో హనుమకొండ అగ్నిమాపకశాఖధికారి నాగరాజుతోపాటు వరంగల్ జిల్లా ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ రవీందర్, హనుమకొండ, వరంగల్ ఫైర్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి

- రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు
- రత్నగిరిలో విషాదం


రాహుల్ (ఫైల్)

భీమదేవరపల్లి, ఏప్రిల్ 14 : భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామానికి చెందిన బానోతు రాహుల్ (15) అనే విద్యార్థి రోడ్డు ప్రమాదంలో గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వంగర ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం తన అమ్మమ్మ గారి ఊరు సిద్దిపేట జిల్లా జిల్లెలగడ్డకు వెళ్లి రాహుల్ తిరిగి వస్తున్నాడు. భీమదేవరపల్లి మండలం మంగళపల్లి శివారులో ట్రాక్టర్ డ్రైవర్ ఆకస్మాత్తుగా మూల మలుపు వద్ద తిప్పడంతో రాహుల్ ద్విచక్రం వాహనానికి ట్రాక్టర్ తగిలి రాహుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రాహుల్‌ను చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ రాహుల్ ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. రాహుల్ 2024 మార్చిలో పదో తరగతి పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తు న్నాడు. మండలంలోని వంగర హైస్కూల్లో పదో తరగతి చదివి పరీక్షలు రాశాడు. 15ఏళ్ల బాలుడు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు.

నీరుకుళ్లలో సంచరిస్తున్న పునుగు పిల్లలు

- జూపార్క్‌కు తరలించిన ఫారెస్ట్ అధికారులు


బకెట్‌లో దూరిన పునుగు పిల్లి

ఆత్మకూరు, ఏప్రిల్ 14 : అరుదైన పునుగు పిల్లులు నీరుకుళ్ల గ్రామానికి చెందిన పంచి నేని రాజేశ్వరరావు ఇంట్లో ఆదివారం దర్శనమిచ్చాయి. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో తన ఇంటికి ఉదయం పునుగు పిల్లి కుక్కలను చూసి ఇంట్లోకి వచ్చిందన్నారు. వెంటనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వచ్చి పునుగు పిల్లి అని నిర్ధారించుకుని, బంధించి వరంగ ల్ జూపార్క్‌కు తరలించారు. మరొకటి చెట్ల పొదల్లోకి పారిపోగా కుక్కలు వెంబడించడంతో పారిపోయిందన్నారు. గత వారం క్రితం కుక్కలు వెంబడించి పునుగు పిల్లిని చంపి తిన్నట్లు గ్రామస్తులు తెలిపారు. అరుదైన పునుగు పిల్లి గ్రామంలో సంచరించడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు. వెంకటేశ్వరస్వామికి ఎంతో ఇష్టమైన పునుగు పిల్లి తన ఇంట్లోకి రావడంతో ఎంతో అదృష్టంగా వెంకటేశ్వరరావు భావిస్తున్నారు.

కేసీఆర్‌ను కలిసిన సుధీర్‌కుమార్


కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుధీర్‌కుమార్

రాంనగర్, ఏప్రిల్ 14 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి మారపెల్లి సుధీర్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. రెండు రోజుల కిందట సుధీర్‌కుమార్‌ను బీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. అవకాశం దక్కించుకున్న సుధీర్‌కుమార్.. ఆదివారం హైదరాబాద్‌లో కేసీఆర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సుధీర్‌కుమార్ వెంట మాజీ ఎమ్మెల్యే రాజయ్య కూడా ఉన్నారు. రాజయ్య ఎంపీ టికెట్ ఆశించినప్పటికీ సుధీర్ కుమార్‌కు అవకాశం దక్కిన విషయం తెలిసిందే. టికెట్ ఆశించి భంగపడ్డ రాజయ్యను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి కేసీఆర్ వద్దకు తీసుకెళ్లారు. అభ్యర్థి సుధీర్ కుమార్‌తో పాటు రాజయ్య మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు.

బియ్యం దొంగలపై నజర్

- ప్రజా పంపిణీ బియ్యం అక్రమ రవాణా కట్టడికి చర్యలు
- ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం
- దందా చేసే వారి వివరాల సేకరణలో విజిలెన్స్
- పోలీసులు, ప్రజా ప్రతినిధుల ప్రమేయంపై ఆరా
- కేసులు పెట్టేందుకు రంగం సిద్ధం



వరంగల్ క్రైం, ఏప్రిల్ 14 : ప్రజాపంపిణీ బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దందా చేసేవారిపై కేసులు పెట్టేందుకు సిద్ధమైంది. రాష్ట్ర వ్యాప్తంగా చర్యలకు పూనుకున్న ప్రభుత్వం.. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పీడీఎస్ రైస్ కట్టడిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాన్ని వరంగల్‌కు పంపింది. పదిరోజులుగా విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రహస్యంగా పర్యటిస్తూ అక్రమార్కుల వివరాలు సేకరిస్తున్నారు. కోట్లలో నడుస్తున్న దందాలో పెద్ద తలకాయలు ఉన్నట్లు సమాచారం ఉండటంతో ఆ కోణంలో కూడా అధికారులు విచారణ చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల కాళేశ్వరం, ఎల్కతుర్తి, చిల్పూరు ప్రాంతాల్లో అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. యథేచ్ఛగా సాగుతున్న దందా వెనుక పలువురు పోలీసులు, ప్రజాప్రతిధుల సహకారం అందుతుందనే ఆరోపణలున్నాయి. దందాకు సహకరించే వారికి నెలవారీగా మామూళ్లు అందుతాయని అధికారిక సమాచారం.

ప్రజాప్రతినిధులు, పోలీసుల ప్రమేయంపై ఆరా..

ఈ దందాలో ప్రజాప్రతినిధులు, పోలీసుల ప్రమేయంపై రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. హనుమకొండ నుంచి హుజూరాబాద్ వరకు దందా చేస్తున్న ఇద్దరు దళారులకు పలువురు పోలీసులు సహకరించారనే ఆరోపణలున్నాయి. సహకరించిన పోలీసుల వివరాలు విజిలెన్స్ అధికారులు సేకరించినట్లు తెలిసింది. వీరితోపాటు ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా దందా చేసే వారికి అండగా నిలుస్తున్న పోలీసులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతల చిట్టా తయారు చేస్తున్నట్లు సమాచారం. మొత్తంగా ఈ దందాలో ప్రమేయం ఉన్న వారి జాబితా సిద్ధం చేసి ప్రభుత్వానికి అప్పగించే పనిలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నట్లు తెలిసింది.

జిల్లా విజిలెన్స్ అధికారుల పనితీరుపై ఆరోపణలు

జిల్లాకు చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తీరుపై పలు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాకు చెందిని కొంతమంది అధికారుల కనుసన్నల్లోనే ఈ దందా సాగుతుందనే విమర్శలున్నాయి. జిల్లాలో పనిచేసే ఒక హెడ్‌కానిస్టేబుల్ అధికారి ఒకే స్థానంలో దశాబ్దకాలంగా పనిచేస్తూ దందా చేసే వారికి అండగా ఉంటున్నాడనే ఆరోపణలున్నాయి. ఈ హెడ్‌కానిస్టేబుల్ పై అధికారులను మేనేజ్ చేస్తాడనే విమర్శలున్నాయి. దందా చేసే వారి నుంచి వసూళ్లు చేసి అధికారులకు స్థాయిల వారిగా ముట్టచెబుతాడనే ప్రచారం ఉంది. జిల్లా అధికారుల తీరు సరిగాలేకనే రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం జిల్లాలో పర్యటిస్తున్నట్లు అధికారిక సమాచారం.

ప్రాంతాల వారిగా దళారులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలువురు ఈ దందా చేస్తూ కోట్లు మూటగట్టుకున్నట్లు తెలిసింది. ప్రాంతాల వారిగా పెత్తనం చెలాయిస్తూ యథేచ్ఛగా పీడీఎస్ రైస్ దందా చేస్తున్నారు.

- భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్‌కు చెందిన ఒక వ్యక్తి వరంగల్, హనుమకొండ జిల్లాలో ఈ దందా చేస్తున్నట్లు తెలిసింది. ఈయనపై గతంలో పీడీ యాక్ట్ కేసు నమోదు అయినట్లు సమాచారం. గతంలో ఒక పోలీస్ కమిషనర్ ఈయనను నగరంలో ఉండకూడదనే ఆంక్షలు సైతం పెట్టినట్లు తెలిసింది. ఆ అధికారి బదిలీ అయ్యాక దందాను యథాతథంగా కొనసాగిస్తున్నట్లు సమాచారం.
- మంథినికి చెందిన ఒక వ్యక్తి ఈ దందాలో నిష్ణాతుడనే పేరుంది. ఇతడు జిల్లాకు చెందిన విజిలెన్స్ అధికారులను సైతం మేనేజ్ చేస్తాడనే ప్రచారం ఉంది. భూపాలపల్లి, ములుగు ఏరియాల్లో ఇతడి మనుషులతో దందా సాగిస్తున్నట్లు సమాచారం.
- బుద్దారానికి చెందిన మరో వ్యక్తి సైతం ఈ దందా చేస్తాడని తెలిసింది.
- ములుగు జిల్లాకు చెందిన ఒక రైస్ మిల్లు యజమాని పీడీఎస్ రైస్ దందా చేస్తాడని తెలిసింది. తన మనుషులతో గ్రామాల్లోని పీడీఎస్ బియ్యం సేకరించి రైస్‌మిల్లు అడ్డుపెట్టుకుని పెద్దఎత్తున దందా చేస్తాడని సమాచారం.
- మంథనికి చెందిన ఒక వ్యక్తి మహారాష్ట్ర సిరివంచలో రైస్‌మిల్లు నడుపుతూ ఈ దందా చేస్తాడని తెలిసింది. ఇతడి దందాకు ఆ ఏరియా పోలీసులు సహకరిస్తారనే ప్రచారం ఉంది.
- ఇక హనుమకొండ నుంచి హుజూరాబాద్ వరకు ఇద్దరు వ్యక్తులు పీడీఎస్ రైస్ దందా చేస్తూ కోట్లు సంపాదించారనే ఆరోపణలున్నాయి. గ్రామాల నుంచి సేకరించే బియ్యాన్ని కిట్స్ కళాశాల ఏరియాలో, ఓఆర్ఆర్ ఏరియాలో నిల్వచేసి రాత్రి వేళల్లో కొంతమంది పోలీసుల సహకారంతో పొరుగు రాష్ట్రాలకు తరలిస్తారనే ప్రచారం ఉంది. ఈ ఇద్దరిలో ఒక వ్యక్తితో పలువురు పోలీసు అధికారులు సన్నిహితంగా ఉంటూ అతడు ఇచ్చే తాయిళాలు నెలనెల అందుకుంటారనే విమర్శలున్నాయి. ఇలా విచ్చలవిడిగా వరంగల్‌లో అన్ని ప్రాంతాల్లో దందా సాగుతున్నట్లు తెలిసింది. వీరందరి సమాచారం సేకరిస్తున్న రాష్ట్ర విజిలెన్స్ అధికారులు నివేదిక తయారు చేస్తున్నట్లు సమాచారం.

ముత్తిరెడ్డి.. దమ్ముంటే చర్చకు రా!

(5వ పేజీ తరువాయి)

విడ్డూరంగా ఉందన్నారు. తాను జడ్పీటీసీగా పోటీ చేసిన సమయంలోనూ ఇవే ఆరోపణలు చేసి విఫలమయ్యారని గుర్తు చేశారు. ఈ సమయంలోనే ముత్తిరెడ్డిపై కోర్టుకు వెళ్లాలని నిర్ణయించుకున్నానని, కానీ ఒకే పార్టీలో ఉండడం వల్ల ఊరుకున్నానని తెలిపారు. ఈ విషయంపై దళితులే నేరుగా ప్రెస్‌మీట్ పెట్టి తాను ఎలాంటి ఆక్రమణలకు పాల్పడలేదని చెప్పారన్నారు. తాను ఎవరి భూములు ఆక్రమించానో పేర్లు బయట పెట్టాలని, అదే జరిగితే తనపై దళితులతో కేసు పెట్టించాలని సవాల్ విసిరారు. ముత్తిరెడ్డి భూకబ్జాల బాగోతం రాష్ట్రమంతా తెలుసనని ఎద్దేవా చేశారు. గిరిజనుల భూములను బలవంతంగా గుంజుకొని ఫామ్‌హౌస్ కట్టుకున్న చరిత్ర ముత్తిరెడ్డిదని అన్నారు. కూతురు ఛీకొట్టినా ముత్తిరెడ్డికి ఇంకా సిగ్గు రాలేదని మండిపడ్డారు. ముత్తిరెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే తనపై చేసిన ఆరోపణలను జనగామ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు వచ్చి నిరూపించాలని సవాల్ విసిరారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపిస్తే తన 5 ఎకరాల భూమిని ఊర్లోని దళితులకు రాసి ఇస్తానని తేల్చి చెప్పారు. ఈ విషయంలో తాను ఊరుకునే ప్రసక్తే లేదని, కేసీఆర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. ఇలాంటి భూకబ్జాలు చేసే ముత్తిరెడ్డి లాంటి నాయకుల వల్లే బీఆర్ఎస్‌కు చెడ్డ పేరు వచ్చిందని అన్నారు.

కారు అద్దాలు పగలగొట్టాడని..

- యువకుడిని చితకబాదిన ఆరుగురు వ్యక్తులు
- చికిత్స పొందుతూ మృతి



బోయిని భాస్కర్ (ఫైల్)

జనగామ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): కారు అద్దాలు పగలగొట్టాడన్న కోపంతో ఓ యువకుడిని ఆరుగురు కలిసి చితకబాదారు. తీవ్ర గాయాలైన ఆ యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని బాణాపురం కాలనీకి చెందిన బోయిని భాస్కర్(22) శనివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జనగామ చౌరస్తాలో నిలబడి రోడ్డుపై వెళ్తున్న కార్లపై రాళ్లు విసిరేశాడు. రెండు కార్లపై రాళ్లు విసిరేయగా అందులో ఉన్న ఆరుగురు వ్యక్తులు దిగి భాస్కర్‌పై చేతులు, కర్రలతో విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డారు. దీంతో భాస్కర్‌కు తీవ్రగాయాలు కాగా సమాచారం అందుకున్న పోలీసులు జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. కాగా.. దాడి చేసిన వారిలో రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లికి చెందిన కుర్ర కళాధర్, కుర్ర కమలాకర్, చిర్ర శ్రవణ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. మృతుడి తండ్రి బోయిని కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు.

చిందు కళాకారుడికి అరుదైన గౌరవం

ఉగాది జాతీయ పురస్కారం అందుకున్న గడ్డం జలంధర్



హైదరాబాద్‌లో జాతీయ పురస్కారం అందుకుంటున్న జలంధర్

పాలకుర్తి, ఏప్రిల్ 14 : మండలంలోని దర్దెపల్లి గ్రామానికి చెందిన చిందు యక్షగాన కళాకారుడు గడ్డం జలంధర్ ఉగాది మహానంది జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని త్యాగరాయగాన సభలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను సన్మానించారు. ఈ నెల 9న ఉగాది రోజున ప్రకటించిన పురస్కారాలను హైదరాబాద్‌లో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా జలంధర్ మాట్లాడుతూ కళారంగం ద్వారనే తనకు ఈ గుర్తింపు వచ్చిందని అన్నారు. ఈ సందర్భంగా జలంధర్‌ను ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు.



జనగామలో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



స్టేషన్‌ఘన్‌పూర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి



తొర్రూరులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



పాలకుర్తిలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకురాలు ఝాన్సీరెడ్డి

అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

- జయంతి వేడుకల్లో కొనియాడిన నాయకులు

జనగామ, ఏప్రిల్ 14 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత బిఆర్.అంబేడ్కర్ 133వ జయంతిని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. దేశంలోని అణగారిన వర్గాల ప్రజలకు అంబేద్కర్ ఆశాజ్యోతి అని కీర్తించారు. ఆయన జయంతి సందర్భంగా జిల్లాకేంద్రంలోని పలు పార్టీలు, విద్యార్థి, ఉపాధ్యాయ, దళిత సంఘాల ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. పీఆర్‌టీయూ జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొల్ల మహిపాల్‌రెడ్డి, నూకల ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బానోత్ ధర్మబిక్షం ఆధ్వర్యంలో జనగామలోని సీపీఎం కార్యాలయంలో అంబేడ్కర్ జయంతిని నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు అభిగౌడ్ ఆధ్వర్యంలో జనగామ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జనగామ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర కమిటీ సభ్యుడు కూరపాటి శ్రీనివాస్ పూలమాల వేశారు. జనగామ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో నెహ్రూ పార్కు వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జనగామ చౌరస్తాలో కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు దయానందరాణి, అనిల్‌కుమార్, వినోద్‌కుమార్, సుగుణాకర్‌రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి జనగామ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాజమౌళి, చెంచారపు బుచ్చిరెడ్డి, బడికె ఇందిర, బనుక శివరాజ్, వంగాల కల్యాణిమల్లారెడ్డి, బొట్ల శ్రీనివాస్, గాదెపాక రాంచందర్, మేడ శ్రీనివాస్, జక్కుల అనిత తదితరులు పాల్గొన్నారు.

జనగామ బార్ అసోసియేషన్ నాయులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రరుషి, న్యాయవాదులు స్టీవెన్, ఎన్.సిద్దులు, కిషన్, కూరెల్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లారెడ్డి, కోట శంకర్, నర్సింగరావు, అశోక్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తొర్రూరు: పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తొర్రూరు పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రంలోని బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కందుల రేఖ-గట్టయ్య, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర నాయకులు బెలిదె వెంకన్నగుప్తా, అన్నం బ్రహ్మారెడ్డి, రాపోలు మధుసూదన్ రెడ్డి, సీహెచ్ నరేందర్ రెడ్డి, చాడ రాజ్‌కుమార్, చల్లా రాజిరెడ్డి, మారపాక నాగరాజు, బూర్ల శంకర్, నీల గట్టయ్య, తోట వెంకన్న, చేపూరి వినోద్, గడ్డమీది వెంకటస్వామి, ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, మునిగెల రాజు, బెల్లపు వెంకటస్వామి, తాళ్లపల్లి ఉమా-సమ్మయ్యగౌడ్, మాజీ సర్పంచులు భూక్య సుధాకర్‌నాయక్, పోగుల సారంగపాణి, మామిడాల లింగారెడ్డి, నాయకులు తాళ్లపల్లి రాజ్‌కుమార్, ఐలోని సుధాకర్, తెల్లాకుల రామకృష్ణ, ఐలోని రాజు, సానాది రాజు, తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిధిగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి హాజరయ్యారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను తీసుకువచ్చిన గొప్ప నాయకుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, ఎంపీటీసీ పుష్పలీల, గాదెపాక భాస్కర్, జలగం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్‌లో, బహుజన కులాల ఐక్య వేదిక, బీఆర్ఎస్, ఆధ్వర్యంలో వేర్వేరుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సైలు సాయి ప్రసన్నకుమార్, శ్రావన్‌కుమార్, లింగారెడ్డి, గుమ్మడిరాజు సాంబయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: మండల కేంద్రంతో పాటు తిమ్మంపేట, తమ్మడపల్లి(ఐ), కూనూరు, తదితర గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, ఎమ్మార్పీఎస్, దళిత సంఘాల నాయకులు అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ రడపాక సుదర్శన్, జడ్పీటీసీ బేబీ శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రడపాక ఆదాం, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎడ్ల వెంకటస్వామి, ఆయా పార్టీలు, దళిత సంఘాల నేతలు నూకల అయిలయ్య, మారెపల్లి ప్రభాకర్, తాటికాయల ఎల్లయ్య, చింత ఎల్లస్వామి, హరికృష్ణ, నంచర్ల యాదగిరి, టి.రాజెందర్, జెట్టి రవి, రాపర్తి సోమయ్య, కుక్కల ఎల్లయ్య, ఎడ్ల వెంకటయ్య, డానియెల్, మంద మల్లేష్, గొట్టె శంకర్, నాగరాజు, కుంభోజు శ్రీనివాస్, తాళ్లపల్లి జనార్దన్, రమేశ్, శేఖర్, విజయ్, నవీన్, గణేష్, ఎడ్ల శ్రీను, సుధీర్ రెడ్డి, సందీప్, గడ్డం రాజశేఖర్, ఐలయ్య, ప్రతాప్, రవి, తదితరులు అంబేడ్కర్ విగ్రహానికి, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, ఉద్యోగులతో కలిసి తహసీల్దార్ అంబటి ఆంజనేయులు అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, జనసేన, బీఎస్పీ తదితర రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, దండోరా, దళిత, యువజన, స్వచ్ఛంద, అంబేడ్కర్ సంఘాల నాయకులు, కార్యకర్తలు అంబేడ్కర్ విగ్రహాలను పూల మాలలతో నింపి నివాళులు అర్పించారు.

రఘునాథపల్లి: మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహనికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కందుకూరి ప్రభాకర్, వారాల రమేష్, ముసిపట్ల విజయ్, గూడ కిరణ్‌కుమార్, శాగ నాగరాజు, బొంగు అయిలయ్య, గైని శ్రీనివాస్, మడ్లపల్లి సునీత, దొనికెల రమాదేవి, కుర్ర కమలాకర్, ముక్క పరుశరాములు, మహేందర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపల్లి: అంబేద్కర్ 133వ జయంతి వేడుకలు మండలంలో ఆదివారం ఘనంగా జరిగాయి. జడ్పీటీసీ బొల్లం అజయ్‌మణికంఠ, ఎంపీపీ మేకల వరలక్ష్మి, ఐఎన్‌టీయుసీ జిల్లా అధ్యక్షుడు నీలం ఐలేష్, పీఏసీఎస్ చైర్మెన్ గంగిడి నర్సింహా రెడ్డి, కోళ్ల రవి, ఎంపిటిసి పేర్ని ఉష రవి, రంగోజు ఈశ్వరయ్య, రాపోలు రామ్మూర్తి, కడారి చిన్ననాగేష్, నీలం యువరాజ్ తదితరులు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

లింగాలఘణపురం: లింగాలఘణపురం, నెల్లుట్ల, వడ్డిచర్ల, కుందారం, కళ్లెం, నేలపోగుల, మాణిక్యాపురం, జీడికల్ తదితర గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మండల ప్రజలు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కొడకండ్ల: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డి.సురేష్ నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.సోమనర్సయ్య, దర్మారం బిక్షపతి, శ్రీవర్ధ, వలబోజు రమేశ్, సునీల్ రెడ్డి, వీరదాసు శ్రీనివాస్, శివరాములు పాల్గొన్నారు.

దేవరుప్పుల: మండలంలోని కామారెడ్డిగూడెం బస్‌స్టాప్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి దేవరుప్పుల ఎంపీపీ బస్వ సావిత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా మండలకేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ, సీపీఎం, యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయాపార్టీల మండల అధ్యక్ష, కార్యదర్శులు కాసాని సత్తయ్య, సింగారపు రమేష్ అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చింత రవి, బిక్షపతి, ఏల సుందర్, గిరి, కొండయ్య, మహేష్, పరుశరాములు, నర్సయ్య పాల్గొన్నారు.

తరిగొప్పుల: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వగలబోయిన యాదగిరి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు పాకాల వెంకన్న, ఎంపీటీసీ అర్జుల మధుసూదన్ రెడ్డి, నాయకులు దామెర లూక, పండుగ కనుకయ్య, బ్యాంగి శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్మెట: మండలకేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘాలు, కాంగ్రెస్, బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు పల్లె ప్రభుదాస్, ఎనుగుల వెలంగిణి, కాంగ్రెస్ నర్మెట గ్రామ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు చెవుల పరుశరాములు తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: మండలంలోని పల్లగుట్టలో స్టేషన్‌ఘన్‌పూర్ - చిలుపూర్ మండలాల ఉమ్మడి పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాజవరంలో జై భీం యూత్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టారు. చిన్నపెండ్యాల, వెంకటాద్రిపేట, మల్కాపూర్ తదితర గ్రామాల్లో అంబేద్కర్ సంఘాల ఐక్యవేదిక వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లందుల సుదర్శన్, ఎడ్ల శ్రీనివాస్, కిరన్ కుమార్, అనిల్, ఎడ్ల రాజేష్, ఎంపీటీసీ ఎన్నకూస కుమార్, రత్నాకర్ రెడ్డి, గడ్డమీది సురేష్, మర్రి దుర్గాప్రసాద్, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, కనకం మహేందర్, తౌటి సునిల్ తదితరులు అంబేద్కర్‌కు నివాళి అర్పించారు.

బచ్చన్నపేట: మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంబేద్కర్ తన జీవితకాలంలో ఎదుర్కొన్న అవమానాలపై చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. అంబేద్కర్ కొందరివాడు కాదని, దేశప్రజలందరివాడని అన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్, మాలమహానాడు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. కట్కూరు, నాగిరెడ్డిపల్లి, కేశిరెడ్డిపల్లి గ్రామాల్లో నూకల బాల్‌రెడ్డి, మేకల రాజు, వేముల వెంకట్‌గౌడ్, దయాకర్‌రెడ్డి, కంతి సత్తయ్య, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ నేతలు అల్వాల నర్సింగరావు, పైస రాజశేఖర్, అల్వాల అనిల్, రాజు, బాలకిషన్‌గౌడ్, అల్వాల ఎల్లయ్య, తదితరులు నివాళి అర్పించారు.

దేవరుప్పుల కాంగ్రెస్‌లో ఘర్షణ

- బీఆర్ఎస్ కార్యకర్తలను చేర్చుకోవడంపై లొల్లి
- ఝాన్సీరెడ్డిని నిలదీసిన నాయకులు
- 15 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

దేవరుప్పుల, ఏప్రిల్ 14: దేవరుప్పుల మండల కాంగ్రెస్ శ్రేణుల్లో ఘర్షణ జరిగింది. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. దీన్ని కొందరు కాంగ్రెస్ నాయకులు విభేదించారు. తమకు సమాచారం ఇవ్వకుండా ఇతర పార్టీ నాయకులను ఎలా చేర్చుకుంటారని, తాము రేపటిరోజుల్లో వారితో ఎలా కలిసి పనిచేయాలని ప్రశ్నించారు. గొల్లపల్లి గ్రామ కమిటీతో పాటు ఇతర ముఖ్య నాయకులకు సమాచారమివ్వకుండా బీఆర్ఎస్ పార్టీ వారికి కండువాలు ఎలా కప్పుతారని నిలదీశారు. దీంతో ఝాన్సీరెడ్డి ఎదుటే పార్టీ శ్రేణుల మధ్య లొల్లి జరిగింది. వాదోపవాదాలు, ఘర్షణ, తోపులాటలు జరిగాయి. సుమారు గంటపాటు ఉద్రిక్తత నెలకొంది. సమాచారమందుకున్న పోలీసులు ఫంక్షన్‌హాలుకు చేరుకున్నారు. ఝాన్సీరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, ఇతర ముఖ్యులు ఎంత చెప్పినా వినే పరిస్థితిలో కార్యకర్తలు లేకపోవటంతో పోలీసులు రంగంలోకి దిగారు. గొడవకు దిగుతున్న 15మంది కాంగ్రెస్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై చెన్న కేశవులు తెలిపారు.



దేవరుప్పులలో మాట్లాడుతున్న హనుమాండ్ల ఝాన్సీరెడ్డి

అతిపెద్ద పార్టీగా అవతరించాలి: ఝాన్సీరెడ్డి

కాంగ్రెస్ అతి పెద్ద పార్టీగా అవతరించాలని పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి హనుమండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. పార్టీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేవరుప్పుల మండలం ఒకప్పుడు కాంగ్రెస్‌పార్టీకి కంచరకోటగా ఉండేదని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకే ఇతర పార్టీలనుంచి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నటు ఆమె వెల్లడించారు. ఏ పార్టీ వారినైనా కాంగ్రెస్‌లో చేర్చుకుంటామని అన్నారు. కొంత మంది కావాలని పార్టీకి నష్టం కలిగించే ప్రయత్నం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, నాయకులు తోటకూరి పాండుకృష్ణ, ధర్మారెడ్డి, గణేష్, రెడ్డి రాజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు: ఆర్డీవో



తిమ్మంపేటలో ధాన్యం తేమను పరిశీలిస్తున్న ఆర్డీవో వెంకన్న

జఫర్‌గడ్, ఏప్రిల్ 14: రైతులకు ఇబ్బందులు కలిగించకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్న నిర్వాహకులను ఆదేశించారు. ఆదివారం ఆయన తిమ్మంపేటలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని, రైతుల వివరాలను ఎప్పటికపుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బస్తాలను తూకం వేసిన వెంటనే సంబంధిత రైస్ మిల్లులకు తరలించేలా చూడాలన్నారు. కేంద్రాల్లో నీడ, తాగునీరు, వంటి వసతి సౌకర్యాలను కల్పించాలన్నారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు కాకుండా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ప్రభుత్వం తగు మద్ధతు ధరతో ధాన్యాన్ని కొనుగోలు చేస్తోందన్నారు. దళారులను ఆశ్రయించి మోసాలకు, నష్టాలకు గురి కావద్దన్నారు. రైతుల ప్రయోజనం కోసమే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కేంద్రంలో ధాన్యం తేమను, సౌకర్యాలను ఆర్డీఓ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ అంబటి ఆంజనేయులు, ఎంఆర్ఐ అనిల్‌కుమార్, ఐకేపీ ఏపీఎం సురెందర్, సిబ్బంది, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి



కృష్ణాజీగూడెంలో మాట్లాడుతున్న మాలోతు రమేష్‌నాయక్

చిలుపూర్, ఏప్రిల్ 14 : వచ్చే నెల 13న జరిగే వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ మాలోతు రమేష్‌నాయక్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం కృష్ణాజీగూడెంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను వారికి వివరించారు. పార్టీ సూచించిన అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్ విజయానికి ప్రతీఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం పార్టీ గ్రామశాఖ అధ్యక్షునిగా సాదం (మచ్చ) మల్లేష్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బాపురెడ్డి, సాదం విష్ణు, రఘు, రాజశేఖర్‌రెడ్డి, కర్ర మల్లారెడ్డి, గట్టుమల్లు, లింగన్న, యాదగిరి, మల్లం రవి, బుస్స యాదగిరి, గద్ద రాజు, బాలు, నరేష్, కిషన్‌రెడ్డి, ఆవుల రాజు పాల్గొన్నారు.

హన్మంతాపూర్‌లో హనుమాన్ యజ్ఞం

నర్మెట, ఏప్రిల్ 14 : మండలంలోని హన్మంతాపూర్ గ్రామంలో హనుమాన్ మాలాధారణ స్వాములు రాగుల బీరయ్య, బేజాడి మల్లేషం ఆధ్వర్యంలో ఇరుముడి కట్టుకొని భక్తిశ్రద్ధలతో హనుమాన్ యజ్ఞం నిర్వహించారు. హనుమాన్ జెండాతో గ్రామంలో ఊరేగింపు చేయగా మహిళలు బిందెలతో నీళ్లు పోసి ప్రత్యేక పూజలు చేశారు. జెండాను హనుమాన్ దేవాలయం పైన ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా మాలాధారణ స్వాములు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. యజ్ఞ కార్యక్రమంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో హనుమాన్ మాలాధారణ స్వాములు దూసరి శ్రీనివాస్, యాట క్రాంతికుమార్, గుమ్మల కుమార్, కొర్ర వాసురాం, లొంక ప్రవీణ్, మూల కిరణ్, కాల్వ రామకృష్ణ, విజయ్ పాల్గొన్నారు.



హనుమాన్ యజ్ఞం నిర్వహిస్తున్న స్వాములు

పెద్దమ్మగుడికి రూ.10 వేల విరాళం

చిలుపూర్, ఏప్రిల్ 14: మండలంలోని కొండాపూర్ పెద్దమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జి తీగల మహేందర్ యాదవ్ రూ.10 వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ నెల 22న నిర్వహించనున్న ప్రతిష్ఠిత మహోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధులు పుట్ట రాజు, చిలుపూర్ ఆలయ మాజీ డైరెక్టర్ ఉప్పరి గణేష్ మహేందర్‌ను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకారమందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గాలి రాజు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన మాదాసు వెంకటేష్



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన మాదాసు వెంకటేష్

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 14: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మాదాసు వెంకటేష్ సొంతగూటికి చేరుకున్నారు. ఆదివారం కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇవ్వకపోవడంతో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో నిలబడి ఓడిపోయారు. తదనంతరం బీజేపీలో చేరారు. నాలుగేళ్ల పాటు బీజేపీలో ఉండి నియోజకవర్గంలో పార్టీకి గుర్తింపు తీసకువచ్చారు. బండి సంజయ్ చేబట్టిన ప్రజా సంకల్పయాత్రను నియోజకవర్గంలో విజయవంతం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. అయితే 2023 ఎన్నికల సందర్భంగా బీజేపీ టికెట్ ఆశించిన మాదాసుకు అధిష్ఠానం మొండిచేయి చూపింది. దీంతో తీవ్ర అసహనానికి గురైన అయన ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆహ్వానం మేరకు 2023 ఎన్నికల సమయంలో కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తిరిగి కిషన్ రెడ్డి సమక్షంలో సొంతగూటికి వచ్చారు. కార్యక్రమంలో ప్రేమేందర్ రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, గట్టు క్రిష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

బాధితుడికి బాసటగా నిలిచిన స్నేహితులు



రెండు కాళ్లు కోల్పోయిన శ్రీనివాస్‌కు రూ.83వేలు అందిస్తున్న మిత్రులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఏప్రిల్ 14: డివిజన్ కేంద్రానికి చెందిన సాంబారి శ్రీనివాస్ ఇటీవల రైలు ప్రమాదానికి గురై రెండు కాళ్లను కోల్పోయాడు. విషయం తెలుసుకున్న పదోతరగతి మిత్రులు ముందుకు వచ్చి రూ 83,000 సేకరించి ఆదివారం ఆయనకు అందించారు. సాయం అందించిన వారిలో కార్యక్రమంలో సాంబారి సత్యనారాయణ, మంగు వేదప్రకాశ్, సముద్రాల సారంగపాణి, దొంతి వెంకటేశ్వర్లు, గట్టు మురళి, మధు, చిలగాని విజయ్‌కుమార్, ఫణి, గట్టు శ్రీను, తిరుపతి, జక్కుల ప్రభాకర్, పర్వ భువనేందర్ తదితరులు ఉన్నారు.

వల్మిడిలో కొనసాగుతున్న పూజలు

పాలకుర్తి, ఏప్రిల్ 14 : ఈనెల 17న వల్మిడి గుట్టపై సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రెండో రోజున పూజలు కొనసాగాయి. వల్మిడి, ముత్తారం, మంచుప్పుల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి నివేదన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈవో లక్ష్మీ ప్రసన్న, ఎంపీటీసీ తాళ్ల సోమనారాయణ, ఆలయ సిబ్బంది వెంకటయ్య, రాములు, శ్రీనివాస్, మధు, అశోక్ పాల్గొన్నారు.